క్లుప్తంగా...

రేపు దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

మణికొండ: భాగ్యలక్ష్మి కాలనీ, ఓయూ కాలనీల మధ్యలో ఉన్న దుర్గామాత దేవాలయం 18వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నామని దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి కోరారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, గణపతి పూజ, అమ్మవారికి శతఘటాభిషేకం, 9.30 గంటలకు అమ్మవారి అలంకారంతో భక్తులకు దర్శనం, అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయాన్ని తొలగించొద్దు

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారి వెడల్పు పనుల్లో భాగంగా పురాతన హనుమాన్ ఆలయానికి నోటీసులు ఇవ్వడంపై బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని మదన్‌పల్లి సమీపంలో రహదారి పక్కన పురాతన శివాలయం ఉంది. వెడల్పు పనులు చేపట్టడానికి అధికారులు ఆలయానికి నోటీసులు పంపారు. ఇందుకు నిరసనగా స్థానికులకు మద్దతుగా ఆందోళన చేశారు. ఆలయాన్ని తొలగించేందుకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని స్థానికులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నందిగామ ప్రాంతానికి చెందిన అంజమ్మ (58) బాలయ్య భార్యాభర్తలు. వీరి కుమార్తెను కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారు. వారం రోజుల క్రితం అంజమ్మ కూతురు వద్దకు వచ్చింది. శుక్రవారం సాయంత్రం అంజమ్మ ఆమె కూతురు, మనుమరాలు కలిసి గాంధీనగర్ ప్రాంతంలోని దేవాలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతున్నారు. మొదట కూతురు, మనుమరాలు రోడ్డు దాటగా వారి వెనకాలే వచ్చిన అంజమ్మను గుర్తు తెలియని ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

రెండేళ్ల బిల్లులు చెల్లించాలనడం సరికాదు

- వేసవిలో ప్రజలను వేధింపులకు గురి చేయొద్దు
- జలమండలి ఎండీతో చర్చిస్తా
- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సాక్షి ఎఫెక్ట్..



సంబంధిత అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: రెండు సంవత్సరాల నీటి బిల్లులను ఒకేసారి చెల్లించాలని.. లేదంటే నీటి కనెక్షన్లను తొలగిస్తామని భయాందోళనకు గురి చేయడం పద్ధతి కాదని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ జలమండలి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన నివాసంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై ఆయన నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'సాక్షి'లో ప్రచురితమైన 'జలమండలి బిల్లుల మోత' అనే కథనంపై అత్యధిక సమయం చర్చకు దారి తీసింది. రెండు సంవత్సరాల క్రితం నీటి సరఫరా, బిల్లుల వసూలు బాధ్యతలను తీసుకుని తీరికగా ఇప్పుడు రెండు సంవత్సరాల బిల్లులు ఒకే సారి చెల్లించాలనటం భావ్యం కాదన్నారు. ఈ విషయంలో సోమవారం జలమండలి ఎండీ దానకిషోర్‌తో చర్చిస్తానని, అప్పటి వరకు ఎక్కడా బలవంతంగా బిల్లులు వసూలు చేయవద్దని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పథకంలో రిజర్వాయర్లు 80 శాతం, పైప్‌లైన్ పనులు 60 శాతం పూర్తయ్యాయని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



జలమండలి బిల్లుల మోత!

సాక్షిలో ప్రచురితమైన కథనం

బాక్స్ డ్రైన్ పనులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తా..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో ఎస్‌డీపీ కింద కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ పనులను అక్కడి నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు పొడగించాలని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. నిత్యం రద్దీగా ఉండే లాలమ్మగార్డెన్ కూడలి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూడలి, మర్రిచెట్టు కూడలిలలో ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. పంచవటి నుంచి మర్రిచెట్టు, ఫ్రెండ్స్ కాలనీ నుంచి బీఆర్‌సీ వరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల వెడల్పు పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌సీ నుంచి ఔటర్, అలకాపూర్ టౌన్‌షిప్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డుకు త్వరగా రోడ్లను పూర్తి చేయాలన్నారు. తిరుమలహిల్స్, మారుతినగర్ పార్కులను అభివృద్ధి చేయాలని, అలకాపూర్ టౌన్‌షిప్, హుడా కాలనీ కమ్యూనిటీహాల్‌ల నిర్మాణం త్వరగా చేయాలన్నారు. ఈ సమావేశంలో జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్ స్వామి, జీఎం రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, నార్సింగి ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డి, రాయదుర్గం ఎస్సై అంజాద్, ఎస్ఎన్‌డీపీ, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు, బీఆర్ఎస్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



ప్రేమావతిపేటలో పర్యటిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్ కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్డు పనుల కోసం జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, కాలనీ వాసులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు ఉన్నా సహించేది లేదని స్పష్టం చేశారు. సకాలంలో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి రోజు కాలనీలు, బస్తీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. కార్పొరేటర్ వెంట సురేష్‌ముదిరాజ్, సందీప్‌రెడ్డి, రఘుముదిరాజ్, నరోత్తంరెడ్డి, భవానీ దాస్, టి.చిన్న, మాజార్, సందీప్, శ్రీధర్, ఏఈ బల్వంత్‌రెడ్డి, డిఈ శివశంకర్, రవి, లక్ష్మణ్, కృష్ణ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ఎం.రాము వెల్లడించారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా శనివారం 12వ డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రంగా ఊడ్చి పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. స్థానిక ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. తమ ఇంటితో పాటు చుట్టూ పక్కల ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. చెత్త చెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు.

కూలీల కొరత నివారణకు డ్రోన్లు దోహదం



శిక్షణ పొందిన విద్యార్థులతో అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న డ్రోన్లపై శిక్షణ శనివారంతో ముగిసింది. విద్యార్థులను పంట పొలాలకు తీసుకెళ్లి డ్రోన్ల ద్వారా పండ్ల తోటలు, వ్యవసాయ పంటలకు మందులను పిచికారీ చేయించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ విద్యార్థులకు శిక్షణ పత్రాలను అందించిన అనంతరం మాట్లాడారు. రాబోయే రోజులలో ప్రతి రైతు డ్రోన్లను ఉపయోగించి వ్యవసాయం చేస్తారని చీడపురుగుల నివారణతో పాటు, మొక్కలు ఎదగడానికి అవసరమయ్యే పోషక ద్రవణాలను కూడా పిచికారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో కూలీల కొరతను అరికట్టడానికి ఈ డ్రోన్లు చాలా ఉపయోగపడుతాయన్నారు. త్వరలో ఉద్యాన విశ్వవిద్యాలయంలో డ్రోన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, డీన్ చీనా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి



పుప్పాలగూడ నాయకులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పుప్పాలగూడలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శనివారం ఆయన నివాసంలో పుప్పాలగూడ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో ప్రతి నాయకుడు చురుకుగా పాల్గొని పార్టీ, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, నాయకులు ప్రమోద్, నరేందర్, మల్లేష్, బషీర్, రఘు, సత్యనారాయణ, లక్ష్మిశ్రీ పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి

రాజేంద్రనగర్: మాజీ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దగౌనీ భాస్కర్‌గౌడ్ వెల్లడించారు. శనివారం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా అత్తాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో నెహ్రూ చూపిన మార్గాన్ని ఎందరో స్ఫూర్తిగా తీసుకొని పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్ల అధ్యక్షుడు ధనుంజయ్, కోరని బాల్‌రాజ్, మహ్మద్ ఖాలేద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కార్ దవాఖానాలు

గోల్కొండ: 'కార్పొరేట్'ను తలదన్నేలా సర్కార్ దవాఖానాలను మార్చుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో 5 పడకల డయాలసిస్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ ఏరియా ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలను మరింత పటిష్టం చేసి నాణ్యమైన వైద్య సేవలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడేవారు రోజురోజుకూ పెరిగిపోతున్నారని, ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్‌కు డబ్బులు చెల్లించుకోలేక ఎందరో మృత్యువాత పడుతున్నారని ఆయన అన్నారు. ఆరోగ్య మంత్రి హరీష్‌రావును కూడా ప్రత్యేకంగా కలిసి ఆస్పత్రి అభివృద్ధితో పాటు డయాలసిస్ విభాగాన్ని మంజూరు చేయాలని కోరామన్నారు. స్పందించిన ఆరోగ్య మంత్రి 5 పడకల సామర్థ్యం గల డయాలసిస్ విభాగాన్ని గోల్కొండ ఏరియా ఆస్పత్రికి మంజూరు చేశారన్నారు. ఆస్పత్రిలో అదనపు గదులు, అదనపు భవన నిర్మాణానికి సైతం నిధులు మంజూరు అయ్యాయని ఆయన అన్నారు. డయాలసిస్ విభాగానికి ఉస్మానియా ఆస్పత్రికి చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మనీషా ఏరియా ఆస్పత్రికి కన్సల్టెంట్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జయరామ్‌రెడ్డి, ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, ఏకే పఠాన్, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్, డాక్టర్ గోపాల్ తదితరులున్నారు.

జీవో 111 ఎత్తివేత ఎన్నికల డ్రామా

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

శంషాబాద్: జీవో 111 ఎత్తివేత ప్రకటన కేవలం ఎన్నికల లబ్ధి కోసం సర్కారు చేసిన ప్రకటనలా ఉందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆరోపించారు. ఎలాంటి మార్గదర్శకాలు, నియమ నిబంధనలు వెల్లడించకుండా జీవో 111 ఎత్తివేసినట్లు ప్రకటించిన విధానం గందరగోళంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పష్టత లేని ఎత్తివేతను బీఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలు వేసుకుని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీవో ఎత్తివేసారని ప్రకటించినా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు నేటికి జీవో బూచి చూపించిన నిర్మాణాల దగ్గర డబ్బులు ఎందుకు దండుకుంటున్నారని మండిపడ్డారు. జీవో ఎత్తివేస్తే నిర్మాణాలకు అనుమతులు కూడా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ యాదవ్, కుమార్, శ్రీకాంత్, సిద్దు, రాకేష్, రాజ్, జ్ఞానేశ్వర్, అనిల్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు సహకరించండి

రాజేంద్రనగర్: పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌కు అత్తాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీ, అపార్ట్‌మెంట్ వాసులు సహకరించాలని డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీ శంకర్ కోరారు. ప్రతిరోజూ డివిజన్‌లోని బస్తీలు, కాలనీల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలు, కాలనీల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

గొడుగుల అందజేత

బండ్లగూడ: మండుతున్న ఎండలతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఎంపీ రంజిత్‌రెడ్డి గొడుగులను వితరణ చేయగా డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి శనివారం చిరువ్యాపారులు, పెట్రోల్‌బంక్‌ల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. చెట్ల నీడలో ఉంటూ తమ వ్యాపారాలను చేసుకోవాలన్నారు.